ఆదివారం 06 అక్టోబరు 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/




విలేకరులు కావలెను

RNI NO T/TG/2024/1093

Cell: 7013794396


అతితక్కువ కాలంలో 65వేలకు పైగా రీడర్ల మనసు దోచుకున్న ఇయ్యాల్టి న్యూస్ లోకల్ 2 గ్లోబల్ ... ఈ పేపర్ డైలీ పత్రికలో పని చేయుటకు తెలంగాణ వ్యాప్తంగా విలేకరులు కావలెను. కనీస విద్యార్హత కలిగి జర్నలిజంపె ఆసక్తి, తెలుగులో టైప్ చేయగలవారై ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలతో పాటు అన్ని మండలాల వారిగా విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి.

OFFICE ADDRESS
RRR MEDIA, PATELNGAR, AMBARPET, HYD-500013
email id.ramannews9@gmail.com




కాంగ్రెస్ వేదికపైనే..మహిళా నేతకి లైంగిక వేధింపులు 2లో


కెనడాలో భారతీయ విద్యార్థుల పరిస్థితి ఇది.. "వెయిటర్" ఉద్యోగం కోసం బారులు 2లో


లిప్ లాక్ తో హద్దులు దాటి.. ! ప్రీ వెడ్డింగ్ షూట్‌లో ఆ పని కానిచ్చేశారు.. ? 3లో


డ్రగ్స్ డబ్బుతో కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేస్తోంది.. ప్రధాని సంచలన వ్యాఖ్యలు 3లో

# మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం భరోసా

## రూ. 10 వేల కోట్లు అయినా ఇస్తాం: సీఎం రేవంత్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 5: మూసీ నిర్వాసితులకు అండగా ఉంటామని బఫర్‌జోన్‌లో ఇళ్లు ఉన్నవాళ్లకు కూడా ప్రత్యామ్నాయం చూపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఫాం హౌస్‌లను కాపాడుకునేందుకే కొందరు పేదలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రత్యామ్నాయం అడిగితే చెప్పరని విమర్శించారు. చెరువుల ఆక్రమణలతో మన బతుకులు సర్వనాశనం అవుతాయని.. ఎండాకాలం బెంగళూరులో నీళ్లు లేని పరిస్థితి వచ్చిందన్నారు. మూసీ నిర్వాసితులకు రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమని.. చెరువులు, నాలాలు పోయి, చివరకు మూసీ కూడా పోతే నగరం ఎలా వరద భరిస్తుందని రేవంత్ ప్రశ్నించారు. శనివారవ రవీంద్రభారతిలో గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలలో ప్రసంగించిన రేవంత్ కీలక వ్యాక్యలు చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నానని.. ప్రభుత్వం మిమ్మల్ని అనాథలను చేయదు.. మీకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిదని హామీ ఇచ్చారు. మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్ లో ఉన్నవారిని ప్రభుత్వం ఆదుకుంటుంది.. రెచ్చగొట్టే వారి మాటలు నమ్మొద్దు... ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ వేదికగా పేదలకు ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా..మీ మంచి కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురికావద్దని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక పేదలను ఆదుకునేందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉంది.. ఈటెల, కేటీఆర్, హరీష్ కు సూచన చేస్తున్నా..మూసీ పరివాహక ప్రాంత ప్రజలను ఎలా ఆదుకుందామో సూచనలు ఇవ్వాలన్నారు. మా ప్రభుత్వానికి ఎవరిపై కోపం లేదని.. ప్రజలకు మేలు చేయడమే మా ప్రభుత్వ ఎజెండా అని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ సబర్మతీ నదిని అభివృద్ధి చేస్తే చప్పట్లు కొట్టి గొప్పలు చెబుతున్నారు. మరి సబర్మతిలా మూసీని అభివృద్ధి చేస్తే వచ్చిన ఇబ్బంది ఏమిటని రేవంత్ ప్రశ్నించారు. కాకా స్ఫూర్తితో పేదలకు మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్, కేటీఆర్ కు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే ఫామ్ హౌస్ లో కొంత భూమిని పేదలకు దానం చేయాలని రేవంత్ సలహా ఇచ్చారు. మీరు ఫామ్ హౌజుల్లో జమీందారుల్లా బతుకుతారు... పేదలు మాత్రం మూసీ ముంపులో బతకాలా? అవసరమైతే మలక్ పేట్ రేస్ కోర్సును, అంబర్ పేట్ పోలీస్ ఆకాడమీని హైదరాబాద్ బయటకు తరలించి పేదలకు ఇండ్లు కట్టిస్తామని స్పష్టం చేశారు.



## హైడ్రాకు చట్టబద్దత.. ప్రభుత్వం గెజిట్ ముద్ర

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ చట్టంలో మార్పులు చేర్పులు చేసింది రేవంత్ రెడ్డి సర్కార్.. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో హైడ్రాకు చట్ట బద్దత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు.. కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. అనంతరం ఆర్డినెన్సు పై సంతకం కోసం రాజ్ భవన్‌కి ఫైల్ పంపించిన ప్రభుత్వం.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆర్డినెన్సు పై సంతకం చేశారు. దీంతో.. తెలంగాణ ప్రభుత్వం గెజిట్ ముద్ర వేసింది.అయితే ఇటీవల కాలంలో తెలంగాణలో సంచలనం సృష్టించిన హైడ్రాకు సంబంధించి చట్టబద్దత లేదని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.. ఈ క్రమంలో.. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. అందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కాసేపటి క్రితం గెజిట్ విడుదల చేసింది. ఇటీవల హైడ్రా పెద్ద ఎత్తున ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కూల్చివేతలు చేపట్టింది. నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ స్థలాలను కాపాడే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. హైడ్రాను జీవో నెం.99 పేరుతో ఏర్పాటు చేశారు. దీనికి ఏజెన్సీని కూడా రూపొందించింది.అయితే.. హైడ్రా చేస్తున్న విధ్వంసంకు సంబంధించి తెలంగాణ ఎమ్మెల్యేలు, వివిధ ప్రజా సంఘాల నేతలు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ ఆర్డినె న్స్ కు సంబంధించి 6 నెలల్లోనే చట్టంగా రూపొందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చట్టం అమల్లోకి రావాలంటే కచ్చితంగా అసెంబ్లీ ఆమోదం ఉండాలి. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి హైడ్రాకు ఆమోదం తెలుపుతారు. అప్పుడు చట్టంగా రూపాంతరం చెందుతుంది.

## మూసీ నిర్వాసితుల జీవనోపాధిపై.. ప్రభుత్వం సంచలన నిర్ణయం

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 5: గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మహా నగరంలోని అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపేందుకు హైడ్రాను తీసుకొచ్చింది. అలాగే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కోసం కూడా అనేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతాల్లో సర్వే నిర్వహించి.. తొలగించాల్సిన ఇండ్లకు మార్క్ కూడా చేశారు. అయితే ఇక్కడే ప్రభుత్వానికి ప్రజలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూలిస్తే.. రోడ్డున పడతారని నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్‌గా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ను నియమించగా.. ఈ ప్రత్యేక కమిటీలో 14 మందికి చోటు కల్పించినట్లు శనివారం సాయంత్రం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## కొడుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పుల పాలు..


### పొలం అమ్మినా అప్పు తీరక పోవడంతో ఫ్యామిలీ మొత్తం సూసైడ్



ఇయ్యాల్టి న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 5:లోన్, బెట్టింగ్ యాప్?లతో అప్పులు చేసి తీర్చే మార్గం లేక ఎంతోమంది బలైపోతున్నారు. తాజాగా నిజామాబాద్ జిల్లాలో మరో కుటుంబం బలైంది. కుమారుడు బెట్టింగ్ కోసం చేసిన అప్పులు తీర్చలేక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంది. సంతోషంగా ఉన్న కుటుంబాల పాలిట బెట్టింగ్ యాప్‌లు యమపాశాలుగా మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేని సురేశ్, హేమలతలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కుమారుడు హరీశ్(22) పదో తరగతి వరకు చదివి మానేశాడు. అద్దె ఇంట్లో ఉంటూ కిరాణం దుకాణం నడుపుతున్నారు. వ్యవసాయం, కిరాణం మీద వచ్చే ఆదాయంతో కుటుంబంతో సంతోషంగా ఉండేది. అయితే కరోనా సమయంలో హరీశ్, ఆన్లైన్ బెట్టింగ్, పబ్జీ గేమ్‌లకు అలవాటు పడ్డాడు. ఇలా ఆడుతూనే దాదాపు రూ.30 లక్షలు అప్పు చేశాడు. కుమారుడు చేసిన అప్పులు తీర్చడానికి తమకున్న ఎకరం వ్యవసాయ భూమిని అమ్మేసి రూ.12 లక్షలు తల్లిదండ్రులు చెల్లించారు. అయినా అప్పులు పూర్తిగా తీరలేదు. ఇంకా సుమారు రూ.18 లక్షల అప్పు ఉండటంతో ఏం చేయాలో పాలుపోలేదు.కుటుంబానికి ఆధారంగా ఉన్న భూమి పోయింది. కిరాణా దుకాణంతో వచ్చేది అంతంతమాత్రంగానే ఉంది. పిల్లర్ల దశకు వచ్చిన ఇంటి నిర్మాణం సైతం ఆగిపోయింది. దీనికి తోడు మిగిలిన అప్పు ఎలా తీర్చాలో తెలియక, తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో కుమారుడు హరీశ్?తో కలిసి తండ్రి సురేశ్?, తల్లి హేమలతలు ఇంట్లోనే చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు.ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. బెట్టింగ్ యాప్?ల జోలికి వెళ్లొద్దని ఎంత మొత్తుకుంటున్నా, పెడచెవిన పెడుతున్న యువత అనేక కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ఈ వ్యసనం వదలలేక అప్పులు చేస్తూ ఇలా కుటుబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఇలా యువత ప్రాణాలు తీసే స్థాయికి బెట్టింగ్ మహమ్మారి విస్తరించడం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది.

## దేశానికి రోల్ మోడల్‌గా 'భూమాత'..

### అతి త్వరలో అందుబాటులోకి పోర్టల్: మంత్రి పొంగులేటి




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 5: తెలంగాణలో ధరణి ప్లేస్‌లో భూమాత పోర్టల్ రానుంది. అతి త్వరలోనే భూమాత పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశానికే రోల్ మోడల్‌గా భూమాత ఉండబోతోందన్నారు పొంగులేటి. ధరణి సమస్యలకు చెక్ పెట్టేలా.. అందరికి భద్రత కల్పిస్తూ భూమాత రానున్నట్లు వెల్లడించారు. ధరణి మాడ్యుల్స్, టెక్నికల్? ఇబ్బందులు లేకుండా భూమాత పోర్టల్? తీసుకురానుంది రేవంత్ సర్కార్. ఇప్పటివరకూ ఒక్కసారి అప్లికేషన్ ?తిరస్కరణకు గురైతే, అప్పిలేట్ అవకాశం లేకుండా సివిల్ ?కోర్టుకు వెళ్లాల్సి ఉండేది. అయితే, కొత్త చట్టంలో ఈ విధానానికి చెక్? పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవస్థను కూడా ఆన్‌లైన్?లో చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో సమస్యలు ఉన్నాయని గుర్తించిన రేవంత్ ప్రభుత్వం.. వాటి పరిష్కారంపై దృష్టి సారించింది. ధరణిలో సమస్యలు, మార్పులు-చేర్పులు ఇతర అంశాలపై ప్రత్యేక కమిటీ వేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ధరణి సమస్యల పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సవరణలపై కొత్త సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా సమగ్ర చట్టం రూపొందించారు. దీంతో కమిటీ నివేదిక ఆధారంగా సవరణలపై ప్రజాభిప్రాయం పరిగణనలోకి తీసుకుని కొత్తగా భూమాత పోర్టల్‌ను రేవంత్ సర్కార్ అందుబాటులోకి తీసుకువస్తోంది.

## తెలంగాణ రైతులను కాంగ్రెస్ మోసం చేసింది

### ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు



ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, అక్టోబర్ 5: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని పూర్తి చేయలేదని ఆరోపించారు. రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ఇప్పటికీ తెలంగాణలో రైతులు అక్కడి సర్కారును నిలదీస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని అబద్ధపు హామీలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని కామెంట్ చేశారు. మహారాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని, రైతులకు పక్షపాతి ఎన్డీయే ప్రభుత్వమేనని చెప్పారు. మహారాష్ట్రలో మహావికాస్ అఘాదీ అధికారంలో ఉన్నప్పుడు రైతు ప్రయోజనాలకు సంబంధించిన ఎన్నో పనులను నిలిపేసిందని, కేంద్రం నుంచి రైతుల కోసం ఎన్నో నిధులు విడుదల చేస్తే వాటిని దారిమళ్లించి జేబులో వేసుకున్నారని ఆరోపణలు గుప్పించారు. ఆ తర్వాత షిండే సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక అన్నదాతలకు ప్రయోజనాలు చేకూర్చే పనులు పరుగులు పెట్టాయని ప్రధాని మోదీ వివరించారు.

## మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే

### కేటీఆర్ హాట్ కామెంట్స్



ఇయ్యాల్టి న్యూస్, రంగారెడ్డి, అక్టోబర్ 5: మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో శనివారం ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేవంత్ ప్రభుత్వం ఈ పది నెలల్లో కొత్తగా సాధించింది ఏం లేదు.. కానీ రెండు జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ కోసం లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడుతా అంటుండు. రైతుబంధు, ఆసరా పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవట. కానీ లక్షా 50 వేల కోట్లు మూసీలో పోస్తాడట. ఎందుకో తెలుసా..? రైతుబంధు, పెన్షన్లు, తులం బంగారం ఇస్తే మీరు కమిషన్ ఇవ్వరు. కానీ అదే మూసీలో 30 వేల కోట్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపాలి. అందుకు మూసీ పథకం పెట్టిండు. కేసీఆర్ కాళేశ్వరం కట్టిండు, పాలమూరు 90 శాతం కట్టిండు. నీళ్లు ఇచ్చేందుకు కట్టిండు. మరి మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తావు%ॅ%? సమాధనం ఉందా..? అంటే లేదు. కమిషన్లు దొబ్బేందుకు ప్లాన్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఆయనకు కమిషన్ల పిచ్చి పట్టింది. పేదవాళ్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తే పైసలు రావు.. కాబట్టి మూసీ పేరు మీద బ్యూటిఫికేషన్ కాకుండా లూటిఫికేషన్ చేస్తే కాంగ్రెసోళ్లకు డబ్బులు పంపి.. కుర్చీని కాపాడుకునేందుకు రేవంత్ రెడ్డి యత్నిస్తున్నాడని కేటీఆర్ పేర్కొన్నారు.

## హర్యానాలో కాంగ్రెస్ హవా.. జమ్మూ కశ్మీర్‌లో అధికారం ఎవరిదో..! ఎగ్జిట్ పోల్స్ ఏం చెప్పాయంటే..?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 5:జమ్మూ కశ్మీర్, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. జమ్మూ కశ్మీర్‌లో మూడు దశల్లో జరగ్గా.. శనివారంతో ముగిసింది. ఇక హర్యానాలో ఒకే విడదల పోలింగ్ జరిగింది. ఈ నెల 8న ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించనున్నది. ఓటింగ్ ముగిసిన నేపథ్యంలో పలు సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలయ్యాయి. హర్యానాలో ఈ సారి బీజేపీకి పరాభవం తప్పదని.. కాంగ్రెస్‌దే హవా అని పలు సర్వేలు పేర్కొన్నాయి. ఇక జమ్మూ కశ్మీర్‌లో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని పీపుల్స్ పల్స్ సౌత్ సర్వే చెప్పింది. హర్యానాలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఆర్టికల్ 376 ఎత్తిన తర్వాతన తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదని.. నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం అతిపెద్ద పార్టీగా నిలచే అవకాశాలున్నట్లు పేర్కొంది. హర్యానాలో 90, జమ్మూ కశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

**హర్యానా ఎగ్జిట్ పోల్స్ ఇలా..**

పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. కాంగ్రెస్‌కు 55, బీజేపీకి 26, ఐఎన్ఎల్డీ 2-3, బీజేపీకి ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయని చెప్పింది. సట్టా బజార్ సర్వేలో కాంగ్రెస్ 50, బీజేపీ 25 సీట్లు వస్తాయని.. ఏబీపీ-సీ ఓటర్ సర్వేలో బీజేపీకి 78, కాంగ్రెస్ 8కి వస్తాయని తెలిపింది. న్యూస్ 18-ఐపీఎస్ఓఎస్ సర్వేలో బీజేపీ-75, కాంగ్రెస్-10 వస్తాయని తెలిపింది.

**జమ్మూ కశ్మీర్..**

పీపుల్స్ పల్స్ సర్వేలో జేకేఎన్-సీ 33-35, బీజేపీ 23-27, కాంగ్రెస్ 13-15, జేకే పీడీపీ 7-11, ఏఐపీ 0-1, ఇతరులు 4-5 నుంచి సీట్లు గెలిచే అవకాశాలున్నాయని చెప్పింది. రిపబ్లిక్ మాట్రిజ్ సర్వే ప్రకారం.. బీజేపీకి 25, కాంగ్రెస్‌కు 12, ఎన్సీకి 15, పీడీపీకి 28, ఇతరులు ఏడు స్థానాల్లో గెలుస్తారని చెప్పింది. ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో ఎన్సీ కూటమికి 11-15, బీజేపీ 27-31, పీడీపీ 0-2, ఇతరులు 0-1 సీట్లు వస్తాయని పేర్కొన్నది.

ఈ–పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

ఆదివారం 06 అక్టోబరు 2024



# అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే: మాదిరి పృథ్వీరాజ్

ఇయ్యాల్టి న్యూస్, పటాన్ చెరు, అక్టోబర్ 5:మహంకాళీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాదిరి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. పటాన్ చెరువు పట్టణంలో గల మహంకాళి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పటాన్ చెరు పట్టణంలో సన్మాన కార్యక్రమంలో భాగంగా పృథ్వీరాజ్ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ సపానదేవ్, ప్రకాష్ రావు, కార్పొరేటర్ కుమార్ యాదవ్, బసవయ్య, మాణిక్ ప్రభు, చంద్రశేఖర్ రెడ్డి, నర్రా బిక్షపతి, జగన్ ముదిరాజ్, ధనరాజ్ గౌడ్, చందు, దయానంద్ చారి తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటింది: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 5:** సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి ప్రజలకు ఓ వరంలా మారిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. శనివారం గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబర్ పేట నియోజకవర్గం పలు ప్రాంతాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.9లక్షల14 వేల విలువగల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురై దవఖానల్లో చికిత్స పొందిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



## 23 శ్రీబాల త్రిపురసుందరీదేవీగా జైస్వాల్ గార్డెన్ మైసమ్మ

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 3: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ శ్రీశ్రీశ్రీ మైసమ్మ అమ్మవారు శ్రీబాల త్రిపురసుందరీదేవీగా బక్తులకు దర్శనిమిచ్చారు. నవరాత్రుల వేడుకల్లో భాగంగా తొలి రోజు హెూమం, కుంకుమ అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్.రమేశ్ గౌడ్, జి. ప్రసన్న ఆంజనేయులు, సి.యాదవ రెడ్డి, పి వెంకటేష్ గౌడ్, కె.దిలీప్ గౌడ్, పి శ్రీహరి చారి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఏ రామాగౌడ్, బి.మధుసూదన చారి, కె.సత్యనారాయణ తదితరులు ఉన్నారు

# శ్రీ గాయత్రిదేవీగా జైస్వాల్ గార్డెన్ మైసమ్మ

# ఆ విషయంలో రాజీపడబోం.. టీటీడీలో ప్రక్షాళన ప్రారంభించాం..

## సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, అక్టోబర్ 5: శ్రీవారి ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడబోమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ప్రసాదం బాగోలేదని చాలాసార్లు భక్తులు ఆందోళన చేస్తే నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం పూర్తి ప్రక్షాళన చేపట్టామని.. భక్తుల అభిప్రాయాన్ని తీసుకుంటామన్నారు. తిరుమలలో రూ.13.40 కోట్లతో నిర్మించిన వకుళామాత వంటశాలను శనివారం సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వకుళా మాత కేంద్రీయ వంటశాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 1.25 లక్షల మందికి అన్నప్రసాదాన్ని ఈ వంటశాల ద్వారా అందించవచ్చన్నారు. 18 వేల మందికి అరగంటలో ఒక రకం వంటకాన్ని ఈ కిచెన్ ద్వారా అందించవచ్చని తెలిపారు. వెంగమాంబ, అక్షయ, వకుళమాత వంటశాలలతో 3 లక్షల మందికి అన్నప్రసాదం అందించవచ్చని వివరించారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేలా ఆధునిక కిచెన్ లు ఏర్పాటు చేశామని.. శ్రీవారి ప్రసాదాల నాణ్యతలో రాజీపడబోమని తెలిపారు. ముడిసరుకుల నుండి ప్రసాదం బయటకు వచ్చేవరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రపంచంలో ఎవరూ ఎక్కడా తయారు చేయలేకపోయారని.. దీనికి పేటెంట్ కూడా ఉందన్నారు. పవిత్రమైన శ్రీవారి లడ్డు, జిలేబీ, మైసూర్ పాక్, వడకు ప్రత్యేకత ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ముగిసిన ట్రస్మా ఉపాధ్యాయుల 6వ బ్యాచ్ శిక్షణ తరగతులు



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 5: తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ నారాయణగూడ సైన్స్ అకాడమీ ప్రాంగణం లో ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 6వ బ్యాచ్ సైన్స్ టీచర్ల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కాగా శనివారం నుంచి ఈ నెల 10 వ తేదీ వరకు ఫిజికల్ సైన్స్ తో పాటు మరియు బయాలజీ టీచర్ల కోసం 7వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మధుసూధన్, కోశాధికారి ఎన్.రమేష్ రావు, ప్రధాన కార్యదర్శి పి.రాఘవేంద్రరెడ్డి తదితరులు తెలిపారు.



## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 5:

హియాయత్ నగర్ మండల పరిధిలోని 13 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంజూరైన దాదాపు రూ.13లక్షల విలువైన చెక్కులను శనివారం హియాయత్ నగర్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాశీల్దార్ సంధ్యారాణితో కలసి అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# రేపు వామపక్షాల నిరసన కార్యక్రమం



ఇయ్యాల్టి న్యూస్, హనుమకొండ, అక్టోబర్ 5:పాలస్తీనా గజాపై ఇజ్రాయిల్ మారణ కాండకు నిరసనగా రేపు 7న నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్రంలోని 11 వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి .అందులో భాగంగా శనివారం వరంగల్ జిల్లా కేంద్రం లోని సీపీఐ పార్టీ తమ్మెర భవన్ లో జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ 7వ తేదీన పాలస్తీనాలోని గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్, ప్రభుత్వము మారణకాండ మొదలుపెట్టిందని నేటి వరకు 50 వేల మంది ప్రజలను చంపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.మరణించిన వారిలో ఎక్కువమంది మహిళలు పిల్లలు ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు.ఈ దాడులకు నిరసనగా రేపు వరంగల్ నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ఉదయం 11 గంటలకు జరుగు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మూడురోజులు వర్షాలు..

# హైదరాబాద్ సహా 15 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 5: తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఆదివారం యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.



# పెండింగ్ లో ఉన్న నిధులను వెంటనే మంజూరు చెయ్యాలి : కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

ఇయ్యాల్టి న్యూస్, పటాన్ చెరు, అక్టోబర్ 5:పటాన్ చెరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్ర స్థాయిలో ఉందని, వాటి పరిష్కారానికి సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం జలమండలి అధికారి అశోక్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

# అనాధ మృతదేహాలకు అన్నీతానై..అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎండిఆర్ ఫౌండేషన్



ఇయ్యాల్టి న్యూస్, పటాన్ చెరు, అక్టోబర్ 5: తెలిసిన వారికి సాయం చేయడం మంచితనం.. తెలియని వారికీ సాయపడడం మానవత్వం.. మరి మరణించింది ఎవరైనా మనవాళ్లే అనుకొని%ొ%అంతిమ సంస్కారం ఆత్మీయంగా చేయడం మాత్రం కచ్చితంగా కరుణాతత్త్వం!.. దేహం విడిచిన జీవిని అక్కున చేర్చుకునే అపర దైవత్వం. సొంత వారికి దహన సంస్కారాలు చేయడానికి నామోషీగా ఫీల్ అవ్వటం, వారిని పట్టించుకోకపోవడం లాంటివి జరుగుతున్న ఈ రోజులలో.. అనాధ శవాలను అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పట్టణంలోని ఎండిఆర్ ఫౌండేషన్ తాజాగా మరొక అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. పటాన్ చెరు పట్టణంలో బస్టాండ్ ఆవరణలో బిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా అతనికి సంబంధించిన వివరాలు ఏమీ తెలియకపోవడంత, ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటారు..

నేషనల్, ఇంటర్నేషనల్ , క్రైం, వైరల్ న్యూస్

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

ఆదివారం 06 అక్టోబరు 2024



# దేవీశరన్నవరాత్రి వేడుకల్లో ఢోలు వాయించిన.. ప్రధాని మోదీ..

ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, అక్టోబర్ 5: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఉదయం మహారాష్ట్ర పర్యటనకు వెళ్లారు. దీనిలో భాగంగా నాందేడ్ చేరుకున్న ఆయనకు బీజేపీ నేత అశోక్ చవాన్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని నేరుగా పొహరదేవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉన్న జగదాంబ ఆలయాన్ని సందర్శించారు. అక్కడి మూలవిరాట్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన మోదీ.. ఆలయంలో ఏర్పాటు చేసిన ఢోలు మోగించారు. ఆ తర్వాత సంత్ మహారాజ్, రామ్‌రావ్ మహారాజ్ సమాధి అయిన చోటును సందర్శించి నివాళులు అర్పించారు. ఇక దేశవ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్న విషయం తెలిసిందే. గడిచిన మూడురోజులుగా దేశవ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు జరుగుతున్నాయి. దీంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి.



# రూ.3 రూపాయలకే తిన్నోడికి తిన్నంత బిర్యానీ..!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 5: బిర్యానీ అంటే ఇష్టం ఉండని వాళ్ళు ఎవరూ ఉండరు. బిర్యానీ పేరు చెబితేనే లోట్టలేసుకుని ఎప్పుడెప్పుడు తిందామా అని ఎదురు చూస్తుంటారు. సాధారణంగా హెూటల్స్, రెస్టారెంట్లలో మిగతా ఐటమ్స్ తో పోలిస్తే బిర్యానీ రేటు కొంచెం ఎక్కువగానే ఉంటుంది. కానీ, అక్కడ మాత్రం బిర్యానీ కోసం భోజన ప్రియులు బారులు తీరారు. అక్కడికి బిర్యానీ కోసం వచ్చిన వారి కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అంతేకాక క్యూ లైన్ లో తోపులాట జరగకుండా కాపలాగా సెక్యూరిటీని సైతం నియమించారు. ఏంటి ఇదంతా నిజమేనా.. బిర్యానీ కోసం ఇంత చేస్తారా అనే డౌట్ మీకు రావచ్చు.. నిజంగానే ఇలా జరిగిందండి బాబు.. ఎందుకంటే అక్కడ కేవలం రూ. 3 కే బిర్యానీ వడ్డిస్తున్నారు. మరి ఇంకేం..జనం ఊరుకుంటారా%౯% ఏప్పుడేప్పుడు బిర్యాని తిందామా అంటూ లొట్టలు వేసుకుంటూ ఆ రెస్టారెంట్ వద్దకు పరుగులు తీశారు.అయితే ఇదంతా కేవలం



మూడు గంటల ఆఫర్ మాత్రమే అని తెలిసి పలువురు నిరాశకు లోనయ్యారు. ఈ ఆఫర్ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం లో నూతనంగా ప్రారంభించిన అన్లిమిటెడ్ రెస్టారెంట్లో పెట్టారు. భీమడోలు, తాడేపల్లిగూడెంలో ఇప్పటికే అన్లిమిటెడ్ పేరుతో రెండు రెస్టారెంట్లను యాజమాన్యం ప్రారంభించింది. వ్యాపార అభివృద్ధిలో భాగంగా జంగారెడ్డిగూడెంలో మరో కొత్త బ్రాంచ్ ని ఏర్పాటు చేశారు. రెస్టారెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా బంపర్ ఆఫర్ ప్రకటించారు. మూడు రూపాయలకే బిర్యానీ అంటూ వారం రోజులుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పబ్లిసిటీ చేశారు.. మామూలుగానే బిర్యానీ అంటే ఎగబడి తింటారు. అలాంటిది మూడు రూపాయలు అంటే ఆగుతారా%౯%

అనుకున్న దాని కంటే భారీగా బిర్యానీ ప్రియులు రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు.మూడు రూపాయల ఆఫర్ కోసం వచ్చే కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రెస్టారెంట్ బయట యాజమాన్యం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మూడు రూపాయలకు బిర్యానీ కావలసినవారు వరుసగా క్యూలైన్లో వచ్చి 3రూపాయలు చెల్లిస్తే చాలు బిర్యానీ ప్యాకెట్ ఇచ్చేస్తున్నారు.. అయితే క్యూ లైన్ లలో తోపులాట, ఘర్షణలు జరగకుండా ప్రైవేట్ సెక్యూరిటీని సైతం రెస్టారెంట్ యాజమాన్యం ఏర్పాటు చేసింది. అయితే ఈ ఆఫర్ కేవలం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంది. కేవలం మూడు గంటలు మాత్రమే ఆఫర్ ఉండడంతో అవకాశం వినియోగించుకోలేని ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. సుమారు నాలుగు వేల నుండి 5 వేల మంది ఈ ఆఫర్ ను వినియోగించుకున్నట్లు రెస్టారెంట్ యాజమాన్యం తెలిపింది.



## కాంగ్రెస్ వేదికపైనే..మహిళా నేతకి లైంగిక వేధింపులు

ఇయ్యాల్టి న్యూస్, హర్యానా, అక్టోబర్ 5: హర్యానాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమం సభా వేదికపైనే ఆ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు లైంగిక వేధింపులకు గురైంది. పార్టీ సీనియర్ నేత దీపేందర్ హుడా సమక్షంలోనే హర్యానా మహిళా కాంగ్రెస్ నాయకురాలు పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు సమాచారం. కాంగ్రెస్ నాయకురాలు సెల్జా కుమారి ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన గురించి తెలిసిన తర్వాత తాను బాధిత మహిళతో మాట్లాడానని, ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలో తాను వేధింపులకు గురైనట్లు సదరు మహిళ చెప్పారని తెలిపారు. ఏ పార్టీ అయినా కూడా ఏ మహిళని అగౌరపరచకూడదని ఆమె అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఈ ఘటనని ఖండించారు. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. “చాలా దిగ్భ్రాంతికరమైనది! దీపేంద్ర హుడా సమక్షంలోనే వేదికపైనే ఓ మహిళా కాంగ్రెస్ నేతపై కాంగ్రెస్ నేతలు వేధింపులకు పాల్పడ్డారు.దీనిని కాంగ్రెస్ ఎంపీ సెల్జా కుమారి కూడా ధృవీకరించారు. పగటిపూట పూర్తిగా ప్రజల మధ్య సమావేశాల్లో మహిళలు సురక్షితంగా లేరంటే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారు సురక్షితంగా ఉండగలరా..?” అని ప్రశ్నించారు. సిమిజాన్, శారదా రాథోడ్, రాధికా ఖేరా వంటి చాలా మంది మహిళా కాంగ్రెస్ నేతలు, ఆ పార్టీలోని నాయకులచే వేధింపులకు గురయ్యారని, “కాస్టింగ్ కౌచ్” సంస్కృతి గురించి ప్రియాంకాగాంధీ, రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని పూనావాలా ప్రశ్నించారు.

# మానవత్వం సిగ్గుపడేలా.. వీధి కుక్కపట్ల ఫాల్తూగాళ్ల వికృత చేష్టాలు..!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 5: కుక్కలు మనుషులకు అత్యంత ప్రియమైన పెంపుడు జంతువు.. చాలా మంది ఇళ్లలో కుక్కను పెంచుకుంటూ ఉంటారు. వాటిని తమలో ఒకరిగా భావిస్తారు. వాటికి పుట్టిన రోజులు, సీమంతం, బారసాల వంటి శు భకార్యాలు కూడా చేస్తుంటారు. ఇక ప్రేమతో పెంచుకున్న కుక్క చనిపోతే అంత్యక్రియలు కూడా నిర్వహిస్తారు. దశదిన కర్మ కూడా చేస్తుంటారు. ఆ పెంపుడు శునకం పేరిట చుట్టుపక్కల వారికి భోజనాలు కూడా ఏర్పాటు చేస్తుంటారు. కానీ, మనుషుల్లో కొందరు మాత్రం నోరులేని మూగజీవాల పట్ల క్రూరంగా వ్యవహరిస్తుంటారు. అలాంటి అమానవీయ ఘటనలకు సంబంధించిన వీడియోలు గతంలో అనేకం వైరల్ కావటం చూశాం.. తాజాగా అలాంటిదే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. వీడియో చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోయేలా ఉంది. ఇంతకీ ఏం జరిగిందంటే..ఈ భూమిపై లక్షలాది జీవులు సంచరిస్తున్నాయి. ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి దేవుడు అందరికీ సమాన



అవకాశాన్ని ఇచ్చాడు. కానీ మానవ విస్తరణ విధానాలు అనేక జీవుల ఉనికిని తుడిచిపెట్టేశాయి. కొన్ని దాదాపు అంతరించిపోయాయి. మనుషులతో స్నేహంగా ఉండే కొన్ని జంతువులు ఏదో ఒకవిధంగా మానవ నివాసాలలో తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆవులు, పిల్లులు, కుక్కలు సాధారణంగా కనిపిస్తాయి. అవి మానవ కార్యకలాపాలలో జోక్యం చేసుకోవు. అందుకే అవి మానవ నివాసాలలో చోటు సంపాదించాయి. కానీ కొన్నిసార్లు కొందరు వ్యక్తులు నోరులేని జంతువుల పట్ల కూర్రంగా ప్రవర్తిస్తుంటారు. అటువంటి ఘటనలు చూస్తుంటే.. మనుషుల్లో

మానవత్వం పూర్తిగా చనిపోయిందా అనే సందేహం కలుగుతుంది. ఇటీవల ఓ వీధి కుక్క కళ్లు, నోరు కట్టేసి నడిరోడ్డుపై వదిలేసిన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. వైరల్ వీడియోలో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఒక కుక్క ముఖాన్ని గుడ్డతో కట్టేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ కుక్క ముఖానికి మాస్క్ కట్టి నడిరోడ్డుపై వదిలేశారు. కళ్లు కనిపించక పోవటంతో పాపం ఆ కుక్క నరకయాతన పడుతోంది. రోడ్డుపై వాహనాల రద్దీ కారణంగా ఆ శునకం భయం భయంగా ముందుకు నడుస్తోంది. అది గమనించిన ఒక బైకర్ ఆ కుక్క కష్టాన్ని దూరం చేశాడు. కుక్కను కట్టేసి ఉంచిన టవల్ తొలగించాడు. ఆ మాస్క్ తీయగానే కుక్క ఒక్కసారిగా ఒక నిట్టూర్పు తీసుకుని, తనకు వెలుగునిచ్చిన వ్యక్తి దీనంగా చూస్తుంది. ఆ తరువాత బైకర్ తన దారిన తను వెళ్లిపోగా, కుక్క కూడా ఆహారం వెతుక్కుంటూ వెళ్లిపోయింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారటంతో నెటిజన్లు సైతం తీవ్ర స్థాయిలో స్పందించారు.

## పరువు నష్టం కేసు.. రాహుల్‌కు సమన్లు పంపిన పూణె కోర్టు

ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, అక్టోబర్ 5: పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కి పూణె ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. గతేడాది లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ పై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ పూణె కోర్టులో పరువు నష్టం దావా వేశారు.ప్రతి సందర్భంలోనూ సావర్కర్‌ను అవమాన పరిచేలా రాహుల్ విమర్శలు చేస్తున్నారని సత్యకి ఆరోపించారు. ఈ కేసు గత నెలలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ



అయ్యింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు రాహుల్‌కు సమన్లు పంపింది. అక్టోబర్ 23న తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది.

# డ్రగ్స్ డబ్బుతో కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేస్తోంది.. ప్రధాని సంచలన వ్యాఖ్యలు..

ఇయ్యాల్టి న్యూస్, మహారాష్ట్ర, అక్టోబర్ 5: మహారాష్ట్రలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ కాంగ్రెస్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఢిల్లీలో రూ. 5000 కోట్ల విలువైన డ్రగ్స్ రాకెట్‌లో కాంగ్రెస్ నేత ఉండటాన్ని ప్రస్తావించారు. దేశంలోని యువతను డ్రగ్స్ వైపు నెట్టాలని, ఈ దందాలో వచ్చే డబ్బులను ఎన్నికలో వినియోగించి, గెలవాలని ఆ పార్టీ కోరుకుంటోందని ఆరోపించారు. అక్టోబర్ 02న దక్షిణ ఢిల్లీలోని మహిపాల్‌పూర్‌లోని ఓ గోడౌన్‌లో ఢిల్లీ పోలీసులు 560 కిలోల కొకైన్, 40 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.5620 కోట్లగా అంచనా వేశారు. ఈ డ్రగ్స్ కేసులో పోలీసులు




ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు తుషార్ గోయల్‌కి కాంగ్రెస్ పార్టీతో

సంబంధాలు ఉన్నాయని గుర్తించారు. అయితే, కాంగ్రెస్ మాత్రం అతడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించింది. తుషార్ గోయల్ గతంలో 2022 వరకు ఢిల్లీ పీసీసీ ఆర్టీఐ సెల్ ఛైర్మన్‌గా పనిచేశాడనే విషయం విచారణలో వెల్లడైంది. అతడి సోషల్ మీడియా ప్రొఫైల్‌లో ఇప్పటికీ ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ ఆర్టీఐ సెల్ ఛైర్మన్ అనే బిరుదు ఇంకా ఉంది. 2022లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు అతడిని పార్టీ నుంచి తొలగించినట్లు కాంగ్రెస్ పేర్కొంది. అప్పటి నుంచి ఆయనతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పార్టీ పేర్కొంది.

### ‘నేను వెళ్తున్నాను కానీ’

## పాకిస్థాన్‌కు వెళ్లే ముందు విదేశాంగ మంత్రి కీలక ప్రకటన


ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 5: దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత భారత్‌కు చెందిన విదేశాంగ మంత్రి జైశంకర్ పాకిస్థాన్ లో పర్యటించనున్నారు. గతంలో సుష్మా స్వరాజ్ పాక్ లో పర్యటించారు. ఇప్పటి నుంచి ఇప్పటి వరకు మన దేశం నుంచి ఎవ్వరూ మళ్లీ శత్రుదేశం పాకిస్థాన్ కి వెళ్లలేదు. ఈసారి షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశం పాక్ లో నిర్వహిస్తున్నారు. ఈ



సమావేశంలో భారత్ కూడా పాల్గొంటుంది. సమ్మిట్ కోసం దేశ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పాకిస్థాన్ వెళ్లనున్నారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత తర్వాత భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించనుండగా.. ఆసక్తి నెలకొంది. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో జరగనున్న ఎస్‌సీఓ సమావేశంలో భారత్ పాల్గొనాలా వద్దా అనే అంశంపై చాలా కాలంగా చర్చలు జరిగాయి. ఇప్పుడు ఎట్టకేలకు భారత్ ఇందులో పాల్గొనాలని నిర్ణయించుకుంది. దీనిని ధృవీకరిస్తూ.. విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ ఎస్‌సీఓ సమావేశంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది.

# కెనడాలో భారతీయ విద్యార్థుల పరిస్థితి ఇది.. “వెయిటర్” ఉద్యోగం కోసం బారులు..


ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 5: పైచదువులకు అమెరికా లేదా కెనడా వెళ్లాలి. ఇప్పుడు దేశంలో ఇదే ట్రెండ్ నడుస్తోంది. అమ్మానాన్నలు తమ పిల్లలు విదేశాల్లో ఉంటున్నారని తమ బంధువులకు గొప్పగా చెబుతూ మురిసిపోతున్నారు. ఒకప్పుడు ఈ దేశాల్లో జాబులు బాగానే దొరికేవి. పార్ట్‌టైమ్ జాబులతో విద్యార్థులు తమ ఖర్చుల్ని వెల్లదీసే వారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అమెరికా లేదా కెనడా కావచ్చు ఉద్యోగాలు అంత ఈజీగా వచ్చే పరిస్థితి లేదు.తాజాగా.. కెనడాలో ఓ రెస్టారెంట్‌లో వెయిటర్ ఉద్యోగం కోసం భారతీయ విద్యార్థులు దాని ముందు బారులు తీరిన వీడియోని చూస్తే, పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థమవుతుంది. కెనడాలో తందూరి ఫ్లేమ్ అనే రెస్టారెంట్ ముందు, జాబ్ ఇంటర్వ్యూ కోసం భారతీయ విద్యార్థులు క్యూలో నిలుచున్న వీడియో వైరల్ అవుతోంది. వేలాది మంది వెయిటర్, సర్వీస్ స్టాఫ్ ఉద్యోగాల కోసం వరసలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది కెనడాలో చదువుకోవాలని, పనిచేయాలనుకునే వారిని ఒకటికి రెండుసార్లు ఆలోచింపచేస్తోంది.



### లిప్ లాక్ తో హద్దులు దాటి.. !

## ప్రీ వెడ్డింగ్ షూట్‌లో ఆ పని కానిచ్చేశారు.. ?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 5: ఈ మధ్యకాలంలో యువత పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ ఫోటోషూట్ చేయడం సర్వసాధారణమైంది. సరికొత్త థీమ్స్‌తో ఈ ఫోటో షూట్స్ చేస్తూ.. తమ సంతోషకరమైన క్షణాలను మధుర జ్ఞాపకాలుగా దాచుకుంటుంటారు నవ వధూవరులు. ఆ ప్రీ-వెడ్డింగ్ ఫోటోషూట్‌లు ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతుంటాయి. ఇక ఆ కోవకు చెందిన ఓ వైరల్ వీడియో ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తోంది. వైరల్ వీడియో ప్రకారం.. ఓ జంట ప్రీ-వెడ్డింగ్ ఫోటోషూట్ పేరుతో లిప్ లాక్‌లో మునిగిపోవడం మీరు చూడవచ్చు. హద్దులు దాటి మరీ ముద్దులో మునిగిపోయారు ఆ నవ వధూవరులు. ఇక ఈ వీడియోపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తం



అవుతున్నాయి. ‘ఇలా హద్దులు దాటిన ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్ అవసరమా.?’ అంటూ నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ వీడియోను ఓ ట్విట్టర్ అకౌంట్ ఇంటర్నెట్‌లో షేర్ చేయగా.. మిలియన్లలో వ్యూస్ వచ్చిపడుతున్నాయి. అలాగే లక్షల్లో లైకులు వస్తున్నాయి.

# ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/

ఆదివారం 06 అక్టోబరు 2024




చూసి ముర్వాలే

## హీరో నాగార్జునపై కేసు నమోదు..ఎందుకంటే...?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5:సినీ హీరో అక్కినేని నాగార్జునకు ఊహించని షాక్ తగిలింది. ఆయనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హైటెక్ సిటీకి సమీపంలో ఉన్న తమ్మిడికుంట చెరువును కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించిన నాగార్జునపై కేసు నమోదు చేయాలని 'జనం కోసం' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును లీగల్ ఒపీనియన్ కు పంపించిన మాదాపూర్ పోలీసులు... తాజాగా నాగార్జునపై కేసు నమోదు చేశారు.


తుమ్మిడికుంట చెరువులో 3 ఎకరాల భూమిని కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ ను నాగార్జున కట్టారనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్ కన్వెన్షన్ ను హైడ్రా కూల్చేసింది. మరోవైపు, నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆమెపై నాగార్జున క్రిమినల్, పరువునష్టం కేసు వేశారు. ఈ నేపథ్యంలో, నాగార్జునపై కేసు నమోదు కావడం గమనార్హం.

# బిగ్ బాస్ ఓటింగ్‌లో బిగ్ ట్విస్ట్..

## ఈ సండే ఊహించని కంటెస్టెంట్ బయటకు.. షాక్‌లో ఫ్యాన్స్







ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5: బిగ్ బాస్ తెలుగు ఎనిమిదో సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే సక్సెస్ ఫుల్‌గా నాలుగు వారాలు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో ప్రజెంట్ ఐదో వారం ఎండింగ్ కు కూడా వచ్చేసింది. సెప్టెంబర్ 01న మొత్తం 14 మంది కంటెస్టెంట్స్ హౌస్ లోకి అడుగు పెట్టగా, వారానికి ఒక్కరు చొప్పున బయటకు వెళ్లిపోయారు. బెజవాడ బేబక్క, శేఖర్ బాషా, అభయ్, సోనియా ఎలిమినేట్ అయ్యారు. ఇక ఈ వారంలో మిడ్ నైట్ ఎలిమినేషన్ లో భాగంగా ఆదిత్య ఓం కూడా బయటకు వచ్చేశారు. హౌస్‌లో ఉన్న కంటెస్టెంట్స్ లో ఎక్కువ మంది ఆదిత్య ఓం పేరు చెప్పడంతో అతను బయటకు వెళ్లక తప్పలేదు. ఇక ఆదివారం (అక్టోబర్ 06) మరొకరు ఎలిమినేట్ కానున్నారు. దీంతో ఎవరా ఆ ఒకరు అని ఆడియెన్స్ లో ఉత్కంఠ నెలకొంది. కాగా ఐదో వారం నామినేషన్స్ లో మణికంఠ, విష్ణుప్రియ, నబీల్ అఫ్రీదీ, ఆదిత్య ఓం, నైనిక నిఖిల్.. ఇలా మొత్తం ఆరుగురు కంటెస్టెంట్స్ ఉన్నారు. వీరితో ఆదిత్యం ఓం ఇప్పటికే హౌస్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇక ఓటింగ్ విషయానికి వస్తే.. గత వారం లాగే ఈ వారం కూడా నబీల్ అఫ్రిదీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.రెండో స్థానంలో నిఖిల్ ఉండగా, మూడో స్థానంలో మణికంఠ, నాలుగో స్థానంలో విష్ణుప్రియ ఉన్నారు. ఇక ఆఖరి స్థానంలో ఢీ ఫేమ్ నైనిక ఉంది. అంటే ప్రస్తుతం నైనికనే డేంజర్ జోన్ లో ఉందన్నమాట. ఈ క్రమంలో సండే నాడు నైనికనే ఎలిమినేట్ అయ్యే బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ప్రారంభంలో తన గేమ్ తో ఆడియెన్స్ ను బాగానే ఆకట్టుకుంది నైనిక. ఆమె ఆట, మాట తీరు చూస్తుంటే టాప్-5 లో ఉంటుందని భావించారు చాలా మంది. ముఖ్యంగా హౌస్ కు చీఫ్ అవ్వడానికి నైనిక ఆడిన గేమ్ విధానం బిగ్ బాస్ లవర్స్‌ను ఆకట్టుకుంది. అయితే గత కొన్ని రోజులుగా నైనిక ఇన్ యాక్టివ్ గా మారిపోయింది. గేమ్ కూడా డల్ అయిపోయంది. ఈ కారణంగానే ఆమెకు తక్కువ ఓట్లు పడ్డాయని తెలుస్తోంది. మరి నైనికనే ఎలిమినేట్ అవుతుందో లేక బిగ్ బాస్ ట్విస్ట్ ఇచ్చి మరోకరిని బలి చేస్తాడో చూడాలి.

## దేవీ నవరాత్రుల్లో.. చక్కగా చీర కట్టిన కత్రినా కైఫ్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5:నవరాత్రులు మొదలు అయ్యాయి. హీరోయిన్లు అందరూ మండపాల్లో దర్శనం ఇస్తున్నారు. బాలీవుడ్ స్టార్ కత్రినా కైఫ్ కూడా దేవీ నవరాత్రుల సందర్భంగా ఇలా రెడీ అయ్యారు.

## అరెరే అనసూయ... శారీలో సూపర్ గా ..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5: స్టార్ యాక్ట్రెస్, ఒక్కప్పటి యాంకర్ అనసూయ భరద్వాజ్ చీర కడితే ఆ అందమే వేరు. లేటెస్టుగా ఆవిడ శారీ ఫోటోలు షేర్ చేశారు. అయితే... ఫోటోలతో పాటు ఇచ్చిన క్యాప్షన్ ఇంకా బావుంది.



## విజయ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన మమితా బైజు.. ప్రేమలు బ్యూటీ మంచి ఆఫరే పట్టిందిగా

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5: ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది మమితా బైజు. ఈ కేరళ బ్యూటీ తన నటన, గ్లామర్?తో విజయ్? 69 సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది.మమితా బైజు విజయ్ దళపతి సినిమాగా చెప్తోన్న విజయ్ 69లో ఛాన్స్ కొట్టేసింది.23 ఏళ్ల ఈ భామ విజయ్ సినిమాలో నటిస్తుండడంతో తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఇన్?స్టాల్లోని స్టోరీల్లో ఈ విషయాన్ని వెల్లడించింది.ప్రేమలు బ్యూటీ మమితా బైజు తన ఐఫా లుక్స్?ని ఇన్?స్టాలో షేర్ చేసింది. బ్లాక్ శారీ కట్టుకుని దానికి తగ్గ డిజైనర్ బ్లౌజ్?లో అందంగా కనిపించింది మమితా.

## పట్టు పరికిణిలో రచ్చ లేపుతూ... రాశి సింగ్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5: హీరోయిన్ రాశి సింగ్ తాజాగా పట్టు పరికిణిలో అందంగా ముస్తాబై క్యూట్ ఫోటోలు తన సోషల్ మీడియాలో షేర్ చేసింది.



# నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇంట విషాదం...

## పరామర్శించిన పలువురు సినీ ప్రముఖులు





ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 5: టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన కుమార్తె గాయత్రి తుదిశ్వాస విడిచింది. 38 ఏళ్ల గాయత్రికి నిన్న ఛాతీలో నొప్పి రావడంతో ఆమెను వెంటనే హై దరాబాద్ లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించ గా.. చికిత్స పొందుతూ గాయత్రి కన్నుమూసిం ది. కూతురు మృతితో రాజేంద్రప్రసాద్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఇప్పటికే సినీ ప్రముఖులు, సన్నిహితులు రాజేంద్రప్రసాద్ ఇంటికి చేరుకుని ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి, వెంకటేశ్, అల్లు అర్జున్, సాయి కుమార్, దర్శకుడు త్రివిక్రమ్ తదితరులు రాజేంద్రప్రసాద్ ను పరామర్శించారు.కాసేపటి క్రితం అల్లు అర్జున్ రాజేంద్రప్రసాద్ నివాసాకి చేరుకున్న అల్లు అర్జున్.. గాయత్రి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం నటకిరిటీకి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉంటే.. గతంలో జరిగిన ఓ ఆడియో రిలీజ్ కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్ తన కుమార్తె గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట మళ్లీ వైరల్ అవుతుంది. బేవార్స్ సినిమాలో కూతురి మీద ఓ పాట వస్తుందని.. కూతురు లేకపోతే తండ్రి ఎలా అయిపోయాడు.. అమ్మను తన కూతురిలో చూసుకునే తండ్రి ఎంతలా విలవిల్లాడిపోతాడు అనేది ఆ పాటలో ఉంటుందని అన్నాడు. ఆ పాటను సుద్దాల అశోక్ తేజ అద్భుతంగా రాస్తే.. అది తన మనసులోంచి.. గుండెల్లోంచి వచ్చినట్లుగా అనిపించిందని చెబుతూ ఎమోషనల్ అయ్యారు. ప్రేమించి పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన కూతురితో తాను మాట్లాడటం లేదని.. అయినా ఈ పాట విన్న తర్వాత ఆమెను పిలిపించి.. తన మనసులోని మాట ఈ పాటను ప్లే చేసి చూపించానని చూబుతూ తన కూతురిపై ఉన్న ప్రేమను పాట రూపంలో తెలియజేశాడట. చిన్నతనంలోనే తన తల్లి చనిపోతే.. కూతురిలోనే తల్లిని చూసుకున్నాడట రాజేంద్రప్రసాద్. ఇప్పుడు కూతురి మరణంతో రాజేంద్రప్రసాద్ తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.


PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.